Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# పునాదులు లేని పాఠశాల విద్య

మౌలిక వసతులతోనే మనుగడ



మానవ వికాసానికి ప్రాథమిక విద్య పునాది వంటిది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత దేశంలో పాఠశాల విద్య కొంతకాలం పూర్తిగా ప్రభుత్వ అధీనంలో కొనసాగింది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఎంతో మంది విద్యావేత్తలను ప్రపంచానికి అందించిన ఘనత నాటి ప్రభుత్వ పాఠశాలలకు దక్కింది. విశ్వకవి రవీంద్రనాధ్ ఠాగూర్, జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వంటి దిగ్గజాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఆయా రంగాల్లో రాణించిన వారే.

కాలక్రమంలో కార్పొరేట్ విద్యాసంస్థల ప్రాబల్యం పెరగడంతో ప్రభుత్వ పాఠశాలల పతనం ప్రారంభమైంది. 2010-2016 మధ్యకాలంలో దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు 1.30 లక్షలు తగ్గాయి. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో 1.75 లక్షల ప్రవేశాలు పెరగడం గమనార్హం. పద్నాలుగు సంవత్సరాల వరకు ఉచిత విద్య, పౌష్టికాహారం, ఉచితంగా దుస్తులు, పుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను కాదని ఏ సదుపాయాలు లేని, అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరగడానికి గల కారణాలు ఏమిటన్న విషయమై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలల కన్నా నాణ్యమైన విద్య అందిస్తాయన్న అభిప్రాయమే ఇందుకు కారణం. పలు అధ్యయనాలు సైతం ఇదే విషయాన్ని ధ్రువీకరించాయి. 2009-'14 మధ్యకాలంలో దేశ వ్యాప్తంగా ప్రాథమిక విద్య కింద రూ.1.6 లక్షల కోట్లు వెచ్చించినా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత మెరుగుపడలేదు. సగటు తలసరి ఆదాయంలో అత్యంత ధనిక రాష్ట్రమైన దిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో సగంమంది ఉపాధ్యాయులు తాత్కాలిక ప్రాతిపదికన నియమితులైన ఒప్పంద ఉపాధ్యాయులే కావడం గమనార్హం.

యూపీలో 2015-16 మధ్యకాలంలో 50 శాతానికి పైగా పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదివారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 2010-11 నుంచి 2015-16 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల సంఖ్య 35 శాతం పెరగగా ప్రభుత్వ పాఠశాలలు ఒక శాతం మాత్రమే విస్తరించాయి. విద్యాహక్కు చట్టం-2009లోని సెక్షన్-6 'ఎక్కువ పాఠశాలలు నెలకొల్పడం ప్రభుత్వాల బాధ్యత' అని చెబుతోంది. కానీ జరుగుతున్నది దీనికి భిన్నంగా ఉంది. కొత్తగా పాఠశాలలు ఏర్పాటు చేయకపోగా, వివిధ కారణాలను చూపి

ఉన్నవాటిని మూసివేస్తున్న సందర్భాలు లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థుల వలసలు పెరగడం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గడం వల్ల ఇవి మూతపడుతున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మొత్తం 24000 పాఠశాలలు ఈ విధంగా మూతపడ్డాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ పరిస్థితి లేకపోలేదు.

ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో బోధన ప్రమాణాలు తక్కువే. ఈ విషయంలో 74 దేశాలతో పోల్చితే చైనా రెండో స్థానంలో, భారత్ 73వ స్థానంలో ఉన్నాయని గతంలో ఒక అధ్యయనం నిగ్గుతేల్చింది. దేశంలో విద్యారంగానికి కేటాయిస్తున్న నిధుల్లో సుమారు 80శాతం ఉపాధ్యాయుల జీతాలు, వారి శిక్షణపైనే వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనాలను పెంచేటపుడు వారి నైపుణ్యం, పనితీరు, క్రమశిక్షణ, నెరవేర్చిన బాధ్యతలు తదితర అంశాలనూ పరిగణలోనికి తీసుకోవాలన్న ప్రతిపాదన ఉంది.

పాఠశాల, ఉన్నత విద్యపై 2015-16లో భారత్ చేసిన వ్యయం 'బ్రిక్స్' దేశాలు పెట్టిన ఖర్చు కన్నా తక్కువ. భారత్ జీడీపీలో కేవలం మూడుశాతం కన్నా తక్కువే వెచ్చిస్తుండగా, రష్యా 3.8, చైనా 4.2 బ్రెజిల్ 5.2, దక్షిణాఫ్రికా 6.9 శాతం వెచ్చిస్తుండటం గమనించదగ్గ అంశం. 2006-2012 మధ్య కాలంలో విద్యపై ప్రభుత్వ ఖర్చు జీడీపీలో 2.2 శాతం నుంచి 2.68 శాతానికి పెరిగింది. అయినా విద్యా ప్రమాణాలలో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. ప్రమాణాల మెరుగుకు విద్యా విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ముందుగా ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలను పెంచాలి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలి.మారిన పరిస్థితుల్లో ముఖ్యంగా ప్రైవేటు రంగం నుంచి పోటీ పెరుగుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై అధికంగా నిధులను వెచ్చించాల్సిన అవసరం మరింత ఎక్కువగా ఉంది. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియామకం, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తే పనితీరు మెరుగుపడే అవకాశం ఉంది.

జాతి భవిత తరగతి గదిలో రూపుదిద్దుకొంటుంది. నాణ్యమైన విద్య అందరికీ అందినపుడే మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి. తద్వారా దేశ ప్రగతికి బాటలు పడతాయి. అందరికీ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలంటే 'అందరికీ ఒకే బడి' విధానం అవసరమని కొఠారీ కమిషన్ ఏనాడో సూచించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్న అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని అమలు చేయాలి. విద్యలో ఆదర్శంగా నిలుస్తున్న ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, బెల్జియం, సింగపూర్, నెదర్లాండ్ తదితర దేశాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. అక్కడి విధానాలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాలి. పునాదిస్థాయిలో విద్య బలోపేతమైతేనే భావితరం వికాసం సాధ్యపడుతుంది!

**- పి.వెంకటేశ్వర్లు**

(రచయిత- ఆంధ్ర విశ్వవిద్యాలయ వాణిజ్య విభాగం ఆచార్యులు)

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org